క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలిమెల : విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మండలంలోని సర్వాయిపేట, పెద్దంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్ ఆయా గ్రామాలకు నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ మంగీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సన్మానం



టేకుమట్ల : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఏడునూతుల నిశిధర్‌రెడ్డిని మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బట్టల మొగిళి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అలాగే జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కలిసి పార్టీ క్రియాశీలక కార్యక్రమాలపై చర్చించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం యుగేందర్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు దావు రఘు, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దుగ్యాల రాంచందర్‌రావు, సామల మధుసూదన్ రెడ్డి, దేశెట్టి సునీల్, తదితరులు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

కాటారం : కాటారం ఎక్సైజ్ శాఖ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నేడు (బుధవారం) కాటారం కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 50 శాతం ధరావత్తు సొమ్ము ముందస్తుగా చెల్లించి వాహనం దక్కించుకున్న తర్వాత అదే రోజు మిగతా నగదు చెల్లించాలని పేర్కొన్నారు. జీఎస్టీ అదనంగా చెల్లించాలని తుక్కు కింద కొనుగోలు చేసిన వాహనాలను పార్ట్స్ విడదీసి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య సూచించారు.

నియామకం



కిషన్‌ప్రసాద్

భూపాలపల్లి రూరల్ : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా కూచన కిషన్ ప్రసాద్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రాజేంద్రప్రసాద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు కిషన్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ



రేగొండ : మండల కేంద్రానికి చెందిన నర్ర మల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు కోలేపాక భిక్షపతి ఉన్నారు.

చర్య తీసుకోవాలి

కాటారం : కాటారం మండల కేంద్రంతో పాటు రేగులగూడెం, పోతులవాయి గ్రామాల్లో ప్రభుత్వ భూములను అక్రమంగా కట్టబెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపుయాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాపు యాదవ్ మాట్లాడారు. అధికారులు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్లు, సముదాయాలు కట్టుకోవడానికి అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను అధికారులు అవినీతికి పాల్పడి ఉద్యోగులకు, వ్యాపారవేత్తలకు అంటగడుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ విచారణ చేసి అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారిపై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను సంరక్షించాలని బాపు యాదవ్ కోరారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



మొగుళ్లపల్లి : మండలంలోని వేములపల్లి పెద్దవాగు నుంచి మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.అశోక్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరికోల్, కొకొండ గ్రామాలకు చెందిన దొగ్గేల జస్వంత్, వీరన్న, గడ్డం కిరణ్, మేకల కార్తీక్ కొంతకాలంగా వేములపల్లి పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేశామన్నారు.

సాగునీరు అందేనా?



ముళ్లపొదలతో నిండిన డీబీఎం-38 కాల్వ



ఎండిపోయిన చలివాగు

ముళ్లపొదలతో నిండిన కాల్వలు

- చెరువుల్లో తగ్గిన నీటి మట్టం
- యాసంగి సాగునీటి కోసం అన్నదాతల ఎదురుచూపు

టేకుమట్ల : యాసంగి సాగుకు రైతులు పంటలు వేసి నీటికోసం ఎదురు చూస్తున్నారు. ఎండాకాలం ఆరంభంలోనే నీటిమట్టం తగ్గిపోయి నీటికి కటకట ఏర్పడింది. రెండు దశాబ్దాల క్రితం పంటల సాగు కోసం డీబీఎం-38 కాల్వను రేగొండ నుంచి టేకుమట్ల చివరి ఆయకట్టు వరకు ప్రభుత్వం నిర్మించింది. కానీ 2018లో అప్పటి ప్రభుత్వం చొరవతో నిధులు కేటాయించి కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, ముళ్లపొదలను తొలగించి నీటిని విడుదల చేశారు. అయితే శిథిలమైన కాల్వ వల్ల చిట్యాల మండలంలోని పలు చోట్ల సాగునీరు పంట పొలాల్లోకి చేరక పోవడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. మళ్లీ కాల్వ మరమ్మతుకు నిధులు కేటాయించి సీసీ మరమ్మతులు చేపట్టడంతో కాల్వ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చింది. కాగా మూడేళ్లుగా మళ్లీ నీటిని కాల్వల్లోకి విడుదల చేయకపోవడంతో కొన్నిచోట్ల మట్టితో, ముళ్లపొదలు ఏపుగా పెరిగి యథాస్థితికి చేరుకుంది. రేగొండ నుంచి టేకుమట్ల చివరి ఆయకట్టు వరకు కాల్వ పొడవు మొత్తం 36 కిలోమీటర్లు ఉంది. రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలాల్లో డీబీఎం-38 కాల్వ ద్వారా రేగొండలో 19,550, చిట్యాలలో 16,569, టేకుమటలో 4,100 ఎకరాల్లో ఆయకట్టు సాగునీరు అందనుంది.

నీటిని విడుదల కోసం ఎదురుచూపు?

వానాకాలంలో రైతులు పత్తి, మిరప పంటలను సాగు చేయగా తెగుళ్ల బారినపడి నష్టాలనే మిగిలింది. దీంతో ఎక్కువ మంది రైతులు యాసంగిలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటను సాగు చేయడంతో నీటి వినియోగం సైతం అంతే స్థాయిలో పెరిగింది. చెరువుల్లో, బావుల్లో నీటి సామర్థ్యం తగ్గిపోవడంతో టేకుమట్ల, చిట్యాల, రేగొండ రైతులు కాల్వ నీటి కోసం ఎదురుచూస్తున్నారు. కాల్వల్లో పెరిగిన ముళ్లపొదలు, చెట్లను తొలగిస్తే కాల్వ ద్వారా సాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించి సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

కాల్వల ద్వారా నీరు విడుదల చేయాలి



యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలను నీటి ఎద్దడి నుంచి రక్షించాలి. అందుకు కాల్వల్లో ఉన్న ముళ్లపొదలు, చెట్లను తొలగించి నీటిని విడుదల చేయాలి. అప్పుడే చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందుతాయి. ఈ ఏడాది చెరువుల్లో నీటి సామర్థ్యం తగ్గడంతో బావుల్లో నీటి మట్టం తగ్గింది. యాసంగిలో రైతులు అధికంగా వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. అధికారులు స్పందించి కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తే రైతుల పంటలకు భరోసా కలుగుతుంది.

\- కొండ్ర ఓదెలు రైతు, రాఘవాపూర్

చర్యలు తీసుకుంటున్నాం..

కాల్వల్లో పేరుకుపోయిన మట్టితో పాటు, ముళ్లపొదలను తొలగించేందుకు నిధులు మంజూరయ్యాయి. కాల్వల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కాల్వల్లో నీటిని విడుదల చేసేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం. అన్ని పనులు పూర్తయ్యాక కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తాం. యాసంగిలో రైతులకు నీటి ఎద్దడి కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

\- వెంకటేశ్వర్లు ఐబీ ఏఈ, టేకుమట్ల

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



కాటారంలో పరిశీలిస్తున్న అధికారులు



మల్హర్: తాడిచర్లలో ట్యాంకు వద్ద డీఈ రమేశ్

కాటారం : వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీఓ వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరా పథకాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. తాగునీటి పథకాల పనితీరు, మిషన్ భగీరథ ద్వారా నీటిసరఫరా, పైపులైన్ లీకేజీలు తదితర అంశాలపై ఆరా తీశారు. నీటిసరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయానికి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. కలుషిత నీరు సరఫరా లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారుల వెంట పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్ : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా నీటిఎద్దడి నివారణకు తగిన చర్యలు చేపడుతున్నట్లు మిషన్ భగీరథ డీఈ రమేశ్‌బాబు అన్నారు. నీటి ఎద్దడి నివారణకు ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మండలంలోని తాడిచర్ల మిషన్ భగీరథ ట్యాంకులను, బోర్లను డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పైపులైన్లను, బోర్లను పరిశీలించి లీకేజీలు ఉంటే బాగు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

'సిగ్నల్ సమస్య పరిష్కరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

టేకుమట్ల : ప్రభుత్వ టెలికం రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌లో సిగ్నల్ సమస్యను పరిష్కరిస్తూ, 4జీ సేవలను అందించాలని ఎన్‌హెచ్‌ఆర్సీ మండల అధ్యక్షుడు శాస్త్రాల కిరణ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగం లేక ఇతర ప్రైవేటు టెలికం సంస్థలను వినియోగదారులు ఎంచుకుంటున్నారని తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌లో తక్కువ టారిఫ్‌లు కలిగి ఉన్నాయని, కాని సిగ్నల్ లేక ఎవరూ వినియోగించుకోలేకపోతుని వెల్లడించారు. అదే అదునుగా ప్రైవేటు టెలికం సంస్థలు వినియోగదారులపై ఎక్కువ టారిఫ్‌లను వేస్తూ సొమ్ము చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన బీఎస్ఎన్ఎల్ సేవలను అందించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఆర్సీ మండల ప్రధాన కార్యదర్శి నాంపెల్లి వీరేశం, కొలుగూరి సదానందం ఉన్నారు.

మహాసభకు ఎమ్మార్పీఎస్ టీఎస్ మద్దతు

- జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లి రూరల్ : ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు-వేలగొంతుకుల మహాసభకు ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 30ఏళ్ల పోరాటం మాదిగ, మాదిగ ఉపకులాలకే కాకుండా సమాజంలోని సబ్బండ వర్గాల ప్రయోజనం కోసం పని చేసిన నాయకుడని, ఆయన కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం జరిగిందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం వర్గీకరణపై పూర్తి హక్కులు రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తూ 2024, ఆగస్టులో తీర్పు వెలువడించిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటిసారిగా అసెంబ్లీలో వర్గీకరణ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు.అయినా ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తకుండా మాల నాయకుల కోసం వర్గీకరణ అంశాన్ని పక్కన పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తూ పబ్బం గడిపే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చావు డప్పుకై సిద్ధం అని తెలియజేస్తూ చేపట్టిన లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల దేవరాజ్, మహేష్, పుల్ల సతీష్, చిరంజీవి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

7,8న యువతకు క్రీడాపోటీలు

చిట్యాల : నెహ్రూ యువ కేంద్రం-వరంగల్ వారి ఆధ్వర్యంలో ఈనెల 7,8 తేదీల్లో మండల కేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాల ఆవరణలో యువతకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కందికొండ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువకేంద్రం వరంగల్ జిల్లా అధికారి చింతల అన్వేష్ ఆదేశాల మేరకు ఈ క్రీడలకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్, రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18-29 సంవత్సరాల లోపు ఉండాలని, యువతీ,యువకులు ఈ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్స్‌తో పాటు మెమొంటోను అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు 99515 80224 (గొల్లపల్లి రాజు), 78159 72223 (నోముల వేణు)లను సంప్రదించగలరని కోరారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భూపాలపల్లి అర్బన్ : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తిరోగమనంగా ఉందని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ శోభన్ మాట్లాడుతూ.. బడాబాబులకు మరింతగా లబ్ధి చేకూర్చేలా, మధ్య తరగతి ఉద్యోగులను మభ్యపెట్టేలా ఈ బడ్జెట్ ఉందని విమర్శించారు. ప్రమాదకరమైన విధానాలు అమలు చేసేందుకు మరింత ప్రోత్సాహకంగా ఉన్న ఈ బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు చింతల రజినీకాంత్, రవికుమార్, రాజేందర్, శంకర్, సునీత, విజయలక్ష్మి, ప్రీతి, నవీన్, సుధాకర్, సరిత, సుజాత, స్మరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఎక్సైజ్ పరిధిలోని పెద్దకుంటపల్లి, గొర్లవీడు తండా, గుడాడ్‌పల్లిలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 40 లీటర్ల గుడుంబా, 20 కిలోల చెక్కెర, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని భూపాలపల్లి ఎక్సైజ్ సీఐ రమ్య తెలిపారు. అలాగే దాడుల్లో 1,750 లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు గుడుంబా తయారు చేస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో భూపాలపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట'



చిట్యాల: ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



మొగుళ్లపల్లి: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిట్యాల : పేద, మధ్య తరగతి, రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చిట్యాలలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో సంక్షేమానికి రూ.12 లక్షల వరకు టాక్స్ మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మకమని చెప్పారు. బడ్జెట్ తెలంగాణ ప్రజలకు వరమని దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ. 80వేలు ఆదా అవుతుందన్నారు. 75 ఏళ్లలో మునుపెన్నడు లేని విధంగా మధ్యతరగతికి అనుకూలంగా బడ్జెట్ రూపొందించారని తెలిపారు. తెలంగాణలో 50లక్షల మందికి పైగా రైతులకు రూ.5లక్షల వరకు రుణం పొందేందుకు ఈ బడ్జెట్ అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. విపక్షాలు బడ్జెట్ పై చేస్తున్న ఆరోపణలు అర్థరహితం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు సుద్దాల వెంకన్న, మండల మొగిలి, గుండ సురేష్, సుధగాని శ్రీనివాస్, మైదం శ్రీకాంత్, అశోక్‌చారి, మహేష్, సంపత్, వివేక్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



రేగొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నిశిధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

రేగొండ : రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. రేగొండలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఐటీ మినహాయింపు ఇవ్వడంతో మధ్య తరగతి, వేతన జీవులకు భారీ ఊరట లభించిందన్నారు. ఈ బడ్జెట్ ద్వారా అనేక రంగాల్లో యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి సుంకరి మనోహర్, మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, నాయకులు పెండ్యాల రాజు, తూర్పాటి మల్లేష్, దయ్యాల కిరణ్, సంతోష్. నరేష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మోరే వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్‌రెడ్డి మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్ రెడ్డి, పులి వెంకట్ రెడ్డి, రాజయ్య, పెల్లి మల్లారెడ్డి, బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణారెడ్డి, శ్రీధర్, బండారి తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయుడు

చిట్యాల : మండలంలోని చల్లగరిగ గ్రామంలో గల రైజింగ్‌సన్ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి అత్యుత్తమైన బోధనను కనబరిచి అందరిని ఆకట్టుకున్నారు. డీఈఓగా ఎస్.ధనుష్, ప్రధానోపాధ్యాయుడిగా వర్షిత్, అలాగే వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రేగొండ : మండలంలోని లింగాల వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ములుగు జిల్లా పాపయ్యపల్లికి చెందిన ఇజ్జిరి దేవేందర్ (30) మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవేందర్ పది రోజుల క్రితం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై చిట్యాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగాల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. మృతుడికి భార్య హర్షిత, కొడుకు ఉన్నాడు.

చేపల వలకు చిక్కుకుని మత్స్యకారుడు..

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకర్లపల్లికి చెందిన బోళ్ల మల్లయ్య (60) చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

రైతులకు అవగాహన



కాటారం : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం శాస్త్రవేత్తలు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అడవి పందుల దాడి- పంట సంరక్షణ మార్గాలపై శాస్త్రవేత్త సునీత వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో చర్చించడంతో పాటు మిర్చి పంటలో పురుగుల నివారణ చర్యలను వివరించారు. రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్, కాటారం, మహాముత్తారం ఏఓలు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.